


"ఏమిటిరోయ్! మళ్ళీ పార్శిల్ వచ్చినట్లుందే చలపాయ్‌కి! లారీ ట్రాన్స్‌పోర్టు సర్వీస్‌లో పనిచేస్తున్నాడని చార్జీ లేకుండా వేసిస్తుంటే ప్రతి వారం విజయవాడ నుంచి పార్శిలు వస్తూంది" అన్నాడు రమణ.

"ఏమోరా! పార్సిల్ వచ్చిన మరునటి రోజు కాలవకట్ట వెంట పాంట్లూ షర్టులూ చీరలూ దొంతరలుగా పెట్టుకొని అమ్ముతాడు. ఇక్కడేమో నవరత్న ట్రాన్స్‌పోర్టు ఆఫీసు గుమాస్తాగా జీతం - అక్కడ పాతబట్టలు అమ్మి సంపాదనా! రెండు చేతులా సంపాదించి జల్సా చేస్తాడనుకో!" అన్నాడు కృష్ణ.

"ఎవడైనా వీడి బంధువు పాత బట్టలకు స్టీలు సామాను అమ్ముతాడేమో!? లేకపోతే వీడికిన్ని బట్టలెలా పంపగలడు?"

"అనుమానం దేనికిరా? ఎదురుగా వుందిగా పార్శిల్! తీసి చూద్దాం! తేలిపోతుంద విషయం!"

ఇద్దరూ కలసి గోతాములో కుట్టిన పార్శిల్‌ను విప్పదీశారు!

లోపల చక్కగా యిస్త్రీచేసిపెట్టిన కాకీ పాంట్లు రెండు, రెండు టెర్లిన్ చొక్కాలు కనబడ్డాయి.

"ఒరేయ్! ఈ కాకీపాంట్లు మనకు సరిగ్గా సరిపోతాయి! తొడిగి చూద్దాం" అన్నాడు రమణ.

రమణ, కృష్ణ ఇద్దరూ తొడుక్కున్న పాంట్లు తీయకుండానే వాటిమీద ఆ. కాకీ పాంట్లు తొడుక్కున్నారు!

సరిగా కొలతలు తీసికొని కుట్టినట్లు సరిపోయాయి పాంట్లు!

కాకీపాంట్లు రెండూ తీసికొని ఏమీ ఎరగనట్లు మిగిలిన బట్టలు గోతాంలో పెట్టి కుట్టేశారు.

సాయంత్రం డ్యూటీకి వచ్చిన చలపతి తనపేర వున్న పార్శిల్ తీసికొన్నాడు.

* * *

ఎగ్జిబిషన్ చూద్దామని విజయవాడ వెళ్ళారు రమణ, కృష్ణ.


చలపతి పార్శిల్‌లోని కాకీ పాంట్లు వేసుకున్నారిద్దరూ!

బస్ స్టాండులో దిగి పోలీస్ స్టేషన్ ముందుగా వెళుతున్నప్పుడు డి.వై.యస్.పి. జీపు వాళ్ళను దాటి స్టేషన్ లోకి వెళ్ళింది.

పది అడుగులు వేశారో లేదో "పకడో" అంటూ వచ్చిపడ్డారు పోలీసులు.

బరబరా రమణని, కృష్ణని స్టేషను లోకి యీడ్చుకు వెళ్ళారు!

చొక్కాలు పైకెత్తి పాంటులవంక పర




కాయించి చూశాడు డి. వై. యస్. పి.

అంతే! ఏం సైగ చేశాడో, ఏమో! ఇద్దరి పాంట్లు వూడలాక్కుని గొడ్లనిబాదినట్లు బాదసాగారు!

బాగా ఒక తడి తగిలాక సబ్ ఇన్స్పెక్టరు వచ్చి "రాస్కెల్స్! నిజం చెప్పండి యీ పాంట్లెక్కడివో" అని అడిగాడు.

ఏడుస్తూ జరిగిన విషయం చెప్పారు.

"అరి వెధవల్లారా! వూరికే వచ్చాయని డి. వై. యస్. పి. గారి పాంట్లు తొడుక్కుని స్టయిల్‌గా స్టేషన్ ముందు తిరుగుతారా?" అంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ ఎప్పుడు ఎఱ్ఱటోపీ వచ్చి వీపు సాపుచేస్తుందోనని హడిలిపోయారు రమణ, కృష్ణ!

మరుసటి రోజు వుదయం విజయవాడలోని నవరత్న లారీ సర్వీసు ఆఫీసు దగ్గర చలపతికి పార్శిల్ పంపుతున్న వ్యక్తిని వలవేసి పట్టుకున్నాడు సబ్‌యిన్స్పెక్టరు.

తన్నుకుంటూ తెచ్చి లాకప్‌లో వేశారు దొంగను! కాని అసలు దొంగ దొరికినా రమణ, కృష్ణల మీద కేసు పోలా!

చోరీసొత్తుతో పట్టుబడ్డందుకు కేసు బనాయించారు వాళ్ళమీద!

డి. వై. యస్. పి. దొరగారి పాంట్లు తొడుక్కుని తిరిగినవాళ్ళని వూరికే వదిలేస్తే డిపార్టుమెంట్ ప్రెస్టేజీ ఏం కావాలి!

సాయంత్రానికి అసలు దొంగను వదిలేశారు. పైనుంచి వచ్చిన ఫోను మెసేజ్ రిసీవ్ చేసికొన్నాక అతన్ని వదలకతప్పలేదు.

అసలు దొంగను వదిలిపెట్టాల్సి వచ్చిందన్న కసితో రమణ, కృష్ణల దుమ్ము రేపేశారు ఆ రోజు రాత్రి, స్టేషన్‌లోని కానిస్టేబుల్స్!